క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మీర్‌పేట: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని లెనిన్‌నగర్ ఏఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ బడంగ్‌పేట ఫీడర్ పరిధిలోని భీష్మానగర్, షిరిడీ ఎన్‌క్లేవ్, గండారెడ్డికాలనీ, సాయిగోకుల్, సాయినగర్, రైతుబజార్, లెనిన్‌నగర్, హుడాకాలనీ, అన్నపూర్ణకాలనీ, బృందావన్‌కాలనీ, చింతలకుంట, లెనిన్‌నగర్‌లో ఉదయం 9నుంచి 11 గంటల వరకు. 11 కేవీ తిరుమలనగర్ ఫీడర్ పరిధిలోని వినాయకహిల్స్ ఫేజ్– 1, 2, 3, తిరుమలనగర్, శ్రీహిల్స్‌లో మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు విద్యుత్ ఉండదు.

శుభాకాంక్షలు



మాజీ మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

బడంగ్‌పేట్: కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ సెక్రటరీ సంపత్‌కుమార్ గౌడ్, పార్టీ మహేశ్వరం సీనియర్ నాయకుడు సూర్ణగంటి విజయ్‌కుమార్, నాయకులు కార్తీక్, సాయికుమార్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



రాజ్‌భూపాల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

పహాడీషరీఫ్: జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్‌ను జల్‌పల్లి మున్సిపాలిటీ బీజేపీ నాయకులు ఆయన నివాసంలో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ బీజేపీ ఉపాధ్యక్షుడు ఎ.సంతోష్, బీజేవైఎం నాయకులు సుమిత్, గౌర మురళీకృష్ణ ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపారు.

గ్రూప్‌-1 విజేతకు పలువురి శుభాకాంక్షలు



కృతికకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

బడంగ్‌పేట్: గ్రూప్– 1 పరీక్షలో రాష్ట్ర స్థాయి 5వ ర్యాంకు సాధించిన బాలాపూర్ జిల్లెలగూడకు చెందిన మాజీ ఎంపీపీ లావణ్య బీరప్ప దంపతుల కూతురు కృతికకు పలువురు శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో మల్లాపూర్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ దండు గణేశ్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ మహేశ్వరి జైహింద్‌కుమార్ ఉన్నారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణకు పరామర్శ

ఆమనగల్లు: అచ్చంపేట శాసనసభ్యుడు, కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణను శుక్రవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. వంశీకృష్ణ ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకుని నగరంలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కసిరెడ్డి.. వంశీని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ముస్లింల అభివృద్ధికే వక్ఫ్ సవరణ బిల్లు

ఆమనగల్లు: పార్లమెంటులో వక్ఫ్ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో శుక్రవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని రాజీవ్ కూడలిలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. ముస్లింల అభివృద్ధికి ప్రధాని సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కండె హరిప్రసాద్, కౌన్సిల్ సభ్యుడు లక్ష్మణ్, మండల అధ్యక్షుడు ఎర్రవోలు శ్రీను, మున్సిపల్ అధ్యక్షుడు కర్నాటి విక్రంరెడ్డి, నాయకులు నర్సింహ, బైకని శ్రీశైలంయాదవ్, చెన్నకేశవులు, పాషా, ప్రభాకర్, శ్రీను, మహేశ్, శ్రీనివాస్, జంగయ్య, శ్రీశైలంయాదవ్, బుచ్చయ్య, పారేశా, మహేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లోక కల్యాణానికి వేళాయె

- రేపు రాములోరి కల్యాణ వేడుక
- ఉత్సవాలకు ముస్తాబైన ఆలయాలు
- కవాడిపల్లిలో మూడురోజుల పాటు కార్యక్రమాలు



కవాడిపల్లిలో కోదండ రామచంద్రస్వామి ఆలయం

అబ్దుల్లాపూర్‌మెట్: శ్రీరామ నవమి వేడుకలకు మండల పరిధి కవాడిపల్లి గ్రామంలోని శ్రీశ్రీశ్రీ కోదండ రామచంద్రస్వామి దేవాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. రేపటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. తొలుత ఈ నెల 6న సాయంత్రం 6గంటలకు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కల్యాణం వైభవంగా జరగనుంది. 7న సాంస్కృతిక కార్యక్రమాలు, హోమాలు. 8న తెల్లవారుజామున రథోత్సవం, రావణ దహన, చక్రతీర్థం నిర్వహించనున్నారు.

ఆలయ చరిత్ర

త్రేతా యుగంలో తండ్రి ఆజ్ఞానుసారం శ్రీరాముడు వనవాసం చేస్తూ.. దండకారణ్యమైన అటవీ ప్రాంతంలో బస చేశారని ప్రతీతి. ఇదిలా ఉండగా ఒకరోజు కొందరు భక్తులు సీతారామ లక్ష్మణ విగ్రహాలతో ఎడ్ల బండిపై ప్రయాణం చేసున్న క్రమంలో చీకటి పడింది. ఈ క్రమంలో వారు ఆ రాత్రికి అక్కడే నిద్రించారు. తెల్లవారు లేచి చూసే సరికి బండిలోని విగ్రహాలు కనబడలేదు. వాటి కోసం వెతకగా.. సమీపాన ఉన్న కొండపైన కనబడ్డాయి. ఇదంతా దేవుడు మాయేనని భావించిన ఆ భక్తులు.. ఆ విగ్రహాలను అక్కడే ప్రతిష్ఠించారు. ఈ ఆలయానికి కాపలాగా శేష నాగు ఉండేదని ప్రచారంలో ఉంది. నాడు గ్రామంలోని రైతులు పండించిన ధాన్యాన్ని కుప్పలుగా ఆలయ సమీపంలోనే పోసేవారని, అందులో నుంచి శేషనాగు వెళ్లి ధాన్యపు కుప్పను రెండు భాగాలుగా విభజిస్తే.. ఒక భాగం రైతులకు, మరో భాగంతో ఏటా సీతారాముల కల్యాణం నిర్వహించేవారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ ఆలయ నిర్మాణం ఎప్పుడు జరిగిందో తెలుసుకునేందుకు కచ్చితమైన చారిత్రక ఆధారాలు లేనప్పటికీ, ఆలయ నిర్మాణ శైలిని చూస్తే గోల్కొండ రాజ్యాన్ని పరిపాలించిన చివరి చక్రవర్తి అబుల్ హసన్ తానిషా పరిపాలనా కాలం నాటిదై ఉండొచ్చని పూర్వీకుల అభిప్రాయం.

చైత్రశుద్ధ పాడ్యమి..

ఏటా చైత్రశుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు ఇక్కడ బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. ముఖ్యంగా నవమి రోజు జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా జరుగుతుంది. వీటితో పాటు హనుమాన్ జయంతి, కృష్ణాష్టమి, ధనుర్మాస ఉత్సవాలను ఈ ఆలయంలో నిర్వహిస్తారు. దాతల సహకారంతో అభివృద్ధి చెందుతున్న గుడిలో గతేడాది నుంచి ప్రతి శనివారం అన్నదానం చేస్తున్నారు.

ఏర్పాటు పూర్తి

శ్రీ రామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు వేలాదిమంది భక్తజనంతో పాటు.. ప్రముఖులు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి



నూతన కార్యాలయ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ కృష్ణానాయక్, వైస్ చైర్మన్ యాదయ్య

- చైర్మన్ సభావత్ కృష్ణానాయక్
- మార్కెట్ కమిటీ కార్యాలయంలో వైస్ చైర్మన్, డైరెక్టర్లతో సర్వసభ్య సమావేశం

మహేశ్వరం: వ్యవసాయ మార్కెట్ కమిటీ స్థలంలో కోల్డ్ స్టోరేజీ నిర్మించేందుకు తమవంతు కృషి చేస్తామని మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సభావత్ కృష్ణానాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో వైస్ చైర్మన్, డైరెక్టర్లు, కమిటీ అధికారులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ కార్యాలయం, కాంప్లెక్స్ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. మార్కెట్ కమిటీకి ఉన్న స్థలంలో నూతనంగా కోల్డ్ స్టోరేజీ నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. కమర్షియల్ కాంప్లెక్స్ మొదటి అంతస్తుపైన మార్కెట్ కమిటీ నూతన కార్యాలయం నిర్మిస్తామని తీర్మాణం చేశారు. రైతు అరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధరను అందిస్తుందన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. మహేశ్వరం మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేసి నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులను మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ నాయకత్వంలో కలిసి నిధులు విడుదల చేయాలని కోరుతామన్నారు. అంతకు ముందు మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ ఎదుట ఉన్న మార్కెట్ కమిటీ స్థలం, కమర్షియల్ షెట్టర్లను వారు పరిశీలించారు. నూతన కార్యాలయం నిర్మాణానికి కావాల్సిన స్థలం పరిశీలించి, ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండుయాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కంబాలపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, శివగళ్ల యాదయ్య, వెంకట్‌రెడ్డి, పాండు రంగారెడ్డి, సురేందర్, పుష్పలత, ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం



ప్రతిజ్ఞ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, నాయకులు

మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్

కందుకూరు: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ ఇన్‌చార్జి వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ మహనీయుల ఆశయాలను సాధించాలంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రజల హక్కులను హరించే కుట్రలో భాగమే స్వాతంత్య్ర పితామహుడు గాంధీజీని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను దేశం మరిచిపోయేలా బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. వారి కుట్రలను తిప్పికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యతను కాంగ్రెస్ తీసుకుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, బడంగ్‌పేట మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ చిగురింత పారిజాత, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, డైరెక్టర్లు సురేందర్, ప్రశాంత్, విష్ణువర్ధన్‌రెడ్డి, పుష్పదర్శన్, పీఏసీఎస్ డైరెక్టర్ ఎస్.వెంకట్‌రాంరెడ్డి, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వ్యవసాయానికి విద్యుత్ అంతరాయం

కందుకూరు: విద్యుత్ టవర్ల నిర్మాణంలో భాగంగా శనివారం మండల పరిధిలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు కందుకూరు సబ్‌స్టేషన్ పరిధిలోని కందుకూరు, దెబ్బడగూడ, నక్కలబావి, కొత్తూర్ ఫీడర్ల పరిధిలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రాచులూరు సబ్ స్టేషన్ పరిధిలో రాచులూరు, తిమ్మాపూర్, తుర్కగూడ అగ్రికల్చర్ ఫీడర్లకు, లేమూరు సబ్‌స్టేషన్ పరిధిలో సరస్వతిగూడ, బైరాగిగూడ ఫీడర్లకు, గూడూరు సబ్‌స్టేషన్ పరిధిలో కటికపల్లి, బండమీద గూడూరు అగ్రికల్చర్ ఫీడర్లకు, గుమ్మడవెల్లి సబ్‌స్టేషన్ పరిధిలో కొలన్‌గూడ, మాదాపూర్, బేగంపేట అగ్రికల్చర్ ఫీడర్లకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. రైతులు సహకరించాలని ఆయన కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్

కందుకూరు: మండల పరిధిలోని సరస్వతిగూడ, లేమూరు గ్రామానికి చెందిన బూస రమోని ఇందిరమ్మ, కాంటేకార్ అమృతకు సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.60వేల చొప్పున మంజూరైన చెక్కులను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని, అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాణాప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కె.విష్ణువర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు డిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, బి.యాదయ్య, ఎ.మహేందర్, జి.బాబయ్య, కె.రాము, టి.మల్లేశ్, హరి తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీది అప్రజాస్వామిక పాలన'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, నాయకులు

పహాడీషరీఫ్: దేశంలో ప్రధాని మోదీ పాలన అప్రజాస్వామికంగా కొనసాగుతోందని జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమ ఇన్‌చార్జి వినోద్ అన్నారు. కార్యక్రమానికి సంబంధించి జల్‌పల్లి మున్సిపాలిటీలోని మరాఠా భవన్‌లో శుక్రవారం మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్‌తో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందరర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం, అంబేడ్కర్‌పై హోంమంత్రి అమిత్ షా సహా బీజేపీ చేస్తున్న అంతర్గత దాడి, దేశాన్ని ముక్కలు చేసే కుట్రపై కాంగ్రెస్ అగ్ర నాయకత్వం దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపట్టిందన్నారు. కులగణన చేసి తెలంగాణలో రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు కల్పించి సీఎం రేవంత్‌రెడ్డి దేశానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. మహాత్మాగాంధీ, అంబేడ్కర్‌లను దేశం మరిచిపోవాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్రలు చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, షేక్ జహంగీర్, మాజీ కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, యాదగిరి, పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మస్న రవికుమార్‌తో పాటు శ్రీనివాస్, నవీన్‌గౌడ్, అబ్దుల్ రవూఫ్, యూసుఫ్ ఖాద్రీ, అహ్మద్ బామ్, బారీ, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులతో ఎంపీడీఓ సరిత, ఎంఈఓ నర్సింహ తదితరులు

ఎంపీడీఓ సరిత

కందుకూరు: విద్యార్థులు కష్టపడి చదివి ఉజ్వల భవిష్యత్ పొందాలని ఎంపీడీఓ సరిత, ఎంఈఓ నర్సింహ, ఎస్ఐ సైదులు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని నేదునూరు మోడల్ స్కూల్, కళాశాలలో ప్రిన్సిపాల్ విష్ణుప్రియ ఆధ్వర్యంలో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు చెడువైపు వెళ్లకుండా సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటాపాటలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పోషకాహార నిపుణుడు రవీందర్‌రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ కోఆర్డినేటర్ మాధవరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువకులు

పహాడీషరీఫ్: ఆపదలో ఉన్నవారి కోసం రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమని మామిడిపల్లి దాసాంజనేయస్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఎడ్ల వాసుదేవారెడ్డి అన్నారు. గ్రామ యువకుడు గుర్జని సుధీర్‌గౌడ్ ఆధ్వర్యంలో వాసుదేవారెడ్డి జన్మదినం సందర్భంగా మిత్ర బ్లడ్ సెంటర్ పర్యవేక్షణలో గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులు, వివిధ సర్జరీల సమయంలో రక్తం అవసరం ఎంతో ఉంటుందన్నారు. అలాంటి వారిని ఆదుకోవడానికి ముందుకొచ్చిన యువకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు భాస్కర్‌రెడ్డి, లాల్ ప్రవీణ్‌గౌడ్, మద్ది జైపాల్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి, సుమన్‌గౌడ్, అఖిల్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, సిద్దుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి కృషి

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదీలాల్

ఆమనగల్లు: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి కృషి చేస్తానని ఆమనగల్లు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు అండేకార్ యాదీలాల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కోర్టు ఆవరణలోని అసోసియేషన్ కార్యాలయంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప, సూపరింటెండెంట్ మురళీధర్, ఎన్నికల అధికారి లక్ష్మణశర్మ, మాజీ అధ్యక్షుడు జగన్‌ల సమక్షంలో అధ్యక్షుడిగా యాదీలాల్, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు, కోశాధికారిగా కృష్ణ, కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం నూతన అధ్యక్షుడిని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కల్వకుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఆమనగల్లు అసోసియేషన్ సభ్యులు రామకృష్ణ, విజయ్‌కుమార్, శేఖర్, మల్లేశ్, న్యాయవాదులు వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావ్, లక్ష్మీనారాయణ, వెంకట్‌గౌడ్, జానకిరాములు, భాస్కర్‌రెడ్డి, జమీల్, కృష్ణయ్య, మల్లేశ్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలి



జిల్లెలగూడలో రేషన్‌షాపు వద్ద ప్రధాని ఫొటో ఏర్పాటు చేస్తున్న బీజేపీ నాయకులు

మీర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన సన్నబియ్యాన్ని కేంద్ర ప్రభుత్వమే ప్రజలకు అందజేస్తోందని ఆ పార్టీ మీర్‌పేట కార్పొరేషన్– 1, 2 అధ్యక్షులు భిక్షపతిచారి, ముఖేశ్‌ముదిరాజ్ అన్నారు. కార్పొరేషన్‌లోని పలు రేషన్‌షాపులలో శుక్రవారం మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సన్నబియ్యాన్ని తామే ఇస్తున్నట్లు కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలన్నారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమేశ్వర్, గాజుల మధు, సత్తయ్య, కాశీరాం యాదవ్, గోపీనాథ్, సిద్దాల శ్రీనివాస్, ద్యాసాని తిరుపతిరెడ్డి, దినేశ్, కోట్ల గోపాల్, ఆకుల రాజు, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయంతో పర్యావరణ పరిరక్షణ



సోలార్ ప్యానెళ్లను ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

అమెజాన్ సంస్థ గ్లోబల్ హెడ్ మెరీనా

కందుకూరు: ప్రత్యామ్నాయ ఇంధన వనరులతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని అమెజాన్ సంస్థ గ్లోబల్ హెడ్ మెరీనా అన్నారు. మండలంలోని నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాలలో అమెజాన్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్ పరికరాలను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యుత్ సరఫరా లేనప్పుడు ఆ అవసరాలను తీర్చడానికి సోలార్ విద్యుత్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సోలార్ విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోలార్ విద్యుత్ గురించి విద్యార్థులకు ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అమెజాన్ సంస్థ ప్రతినిధులు అభిషేక్, విజయశర్మ, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌శర్మ, ఉపాధ్యాయులు సురేష్, వెంకటేశ్, గ్లోరీ, శాంతకుమారి, కౌసల్య, విద్యార్థులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

పహాడీషరీఫ్: జల్‌పల్లి శ్రీరాం కాలనీలోని శ్రీ హర్ష పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఉష్కెమూరి నిరంజన్, వైస్ చైర్మన్ సుజాత, కరెస్పాండెంట్ ఉష్కెమూరి శిరీష, డీన్ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ స్వప్న, మాజీ కౌన్సిలర్లు ప్రశాంతి శ్రీధర్‌గౌడ్, కెంచె లక్ష్మీనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగికి విరమణ సహజమే

మండల విద్యాధికారి చాంప్లా నాయక్



హెచ్ఎం దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

తలకొండపల్లి: ప్రతి ఉద్యోగికి విరమణ సహజమేనని ఎంఈఓ చాంప్లా నాయక్ అన్నారు. విధినిర్వహణలో అందించిన సేవలే గుర్తింపు తెస్తాయని పేర్కొన్నారు. శుక్రవారం చుక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామనాథం ఉద్యోగ విరమణ నేపథ్యంలో ఆయనకు వీడ్కోలు సన్మానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. చేసిన పనులే మనల్ని ఉత్తములుగా తీర్చిదిద్దుతాయని తెలిపారు. రామనాథం తన ఉద్యోగ జీవితంలో క్రమశిక్షణతో మెలుగుతూ.. విద్యార్థులకు చక్కగా పాఠాలు బోధించారని చెప్పారు. ఉత్తములుగా తీర్చిదిద్దారని వెల్లడించారు. ఆయన శేషజీవితం ప్రశాంతంగా కొనసాగాలన్నారు. అనంతరం రామనాథం దంపతులను ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాడ్గుల ఎంఈఓ సర్దార్ నాయక్, జీహెచ్ఎం తెలంగాణ అసోసియేషన్ కార్యదర్శి గిరిధర్, టీచర్స్ యూనియన్ ప్రెసిడెంట్, ప్రధాన కార్యదర్శి, ఎమ్మార్సీ స్టాఫ్ శ్రీశైలం, మల్లయ్య, సీఆర్పీస్ ప్రవీణ్, విజయ్, శేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.